క్లుప్తంగా

మావుళ్లమ్మ హుండీ ఆదాయం లెక్కింపు

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి హుండీ ఆదాయాన్ని గురువారం అధికారులు లెక్కించారు. 55 రోజులకి హుండీ నగదు రూ.43,38, 959, బంగారం 104 గ్రాముల 400 మిల్లి గ్రాములు, వెండి 274 గ్రాములు 600 మిల్లి గ్రాములు, విదేశీ డాలర్లు వచ్చాయి. ఆలయ ప్రధానర్చకులు బ్రహ్మ శ్రీ మద్దిరాల మల్లికార్జునశర్మ, వి.వెంకటేశ్వర రావు, కర్రి శ్రీనివాస్, బుద్ధ మహాలక్ష్మి నగేష్ పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి సత్కారం

వీరవాసరం: రాయకుదురులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 2021–2024 వరకు పేరెంట్ కమిటీ ఛైర్మన్‌గా పనిచేసి రాయకుదురు హైస్కూలు అభివృద్ధిలో ప్రభుత్వం తో పాటు అనేక కార్యక్రమాలలో తనవంతు సహాయ సహకారాలు అందించిన గుబ్బల సత్యనారాయణ దంపతులను, పేరెంట్ కమిటీ సభ్యులను ప్రధానోపాధ్యాయులు కానుకొలను శ్రీనివాసరావు, హైస్కూలు సిబ్బంది గురువారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ గెద్దంభారతి, ఎంపీటీసీ సభ్యుడు కడలి నెహ్రూ, యాజమాన్య కమిటీ ఛైర్మన్ శలా భవాని,వైస్ ఛైర్మన్ పంజా దుర్గా వెంకట గణేష్ పాల్గొన్నారు.

అప్సడా అనుమతులు తప్పనిసరి

కాళ్ల: ఆక్వా సాగు, ప్రాసెసింగ్ ప్లాంట్లు, కోల్డ్ స్టోరేజ్, ఐస్ ప్లాంట్ల నిర్వాహకులు తప్పనిసరిగా అప్సడాలో రిజిస్ట్రేషన్ చేయించుకుని లైసెన్స్ పొందాలని ఎంపెడా అసిస్టెంట్ డైరెక్టర్ ఆనంద్ కుమార్ తెలిపారు. కాళ్ళ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం మత్స్యశాఖ మరియు ఎంపెడా సంయుక్త ఆధ్వర్యంలో అప్సాడా అనుమతులు, ఎంపెడా ఎన్రోల్మెంట్ పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఉండి కేవీకే మత్స్య శాస్త్రవేత్తలు డాక్టర్ ఎ.శ్రీనివాసరావు, ఎంపెడా అసిస్టెంట్ డైరెక్టర్ ఆనంద్ కుమార్ పాల్గొని రైతులకు సలహాలు సూచనలు తెలిపారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎఫ్‌డీఓ రాంబాబు, మత్స్యశాఖ సిబ్బంది, ఆక్వా రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

భీమవరం: హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణపై మీకు తెలుసా? కార్యక్రమం ద్వారా జిల్లాలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అదనపు డీఎంఅండ్‌హెచ్ఓ బి భానూనాయక్ అన్నారు. ఎయిడ్స్ కంట్రోల్ ఆదేశాల మేరకు గురువారం భీమవరం ఐఎంఏ హాల్లో 9, 10వ తరగతుల విద్యార్థులకు జిల్లా స్థాయిలో క్విజ్ పోటీలు నిర్వ హించారు. ఈనెల 31న ఉదయం 6:30 గంటలకు భీమవరం ప్రాంతీయ ఆసుపత్రి నుంచి ప్రకాశం చౌక్ వరకు మారథాన్ కార్యక్రమం నిర్వహిస్తామని అడిషనల్ డిఎంఅండ్ చో డా.భానునాయక్ పేర్కొన్నారు. డీఎంఅండ్‌హెచ్ఓ ఉమామహేశ్వరరావు, దిశ సీపీఎం మధుసూధనరావు, డీఐసీ హరనాథ్, ఏఆర్టీ కౌన్సిలర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

తోలేరు జెడ్పీ హైస్కూల్‌కు ఎక్సలెన్సీ అవార్డు

వీరవాసరం: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన 5 పాఠశాలకు క్రీడా ప్రతిభా అవార్డులను (స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డులు) జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్‌జేడీ, జిల్లా విద్యాశాఖ అధికారి నాగమణి అందించారు. ఈ అవార్డుల్లో జిల్లా పరిషత్ హైస్కూల్ తోలేరు తృతీయ స్థానం సాధించిందని హెచ్ఎం వీఎం జెడ్ శ్యాంప్రసాద్ గురువారం విలేకరులకు తెలిపారు. విద్యార్థులు గత సంవత్సరంలో రాష్ట్ర జాతీయస్థాయి పోటీలలో రాణించడం వల్ల ఈ అవార్డు దక్కిందని పేర్కొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో ఎంతో లాభం

ఉండి: సేంద్రియ వ్యవసాయం అటు రైతులకు,ఇటు ప్రజలకు ఎంతో లాభసాటిగానూ, ఆరోగ్యకరం గానూ ఉంటుందని నేచురల్ ఫార్మింగ్ ఉండి డివిజన్ ఇన్‌ఛార్జ్ మహేష్ అన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నడిచే ప్రకృతి వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో గురువారం ఉండి మండలం పెదపుల్లేరు సేంద్రీయ వ్యవసాయంపై రైతులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌ఛార్జ్‌లు మొగ్గ దుర్గ, యాల రాజేశ్వరి, జిజ్ఞావణిదుర్గ పాల్గొన్నారు.

వనువులమ్మకు లక్ష పుష్పార్చన



పుష్పార్చన చేస్తున్న అర్చకులు

ఆకివీడు: శ్రావణ మాసం ఏకాదశి సందర్భంగా మత్స్యకార కుల దైవం వనువులమ్మ వారిక లక్ష చామంతులతో అర్చన చేశారు. స్థానిక ప్రధాన సెంటర్‌లోని వనువులమ్మ ఆలయం వద్ద గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద లలితా హోమం, ఛండీ హోమం, లక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

మట్టి గణపతే.. మహా గణపతి

- ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలతో పర్యావరణానికి చేటు
- మట్టి విగ్రహాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు, స్వచ్ఛంద సంస్థలు



భీమవరంలో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న దృశ్యం (ఫైల్)



మట్టి వినాయక ప్రతిమలను తయారుచేస్తున్న దృశ్యం

భీమవరం: పండుగలన్నింటిలో వినాయచవితి అంటే ఓ ప్రత్యేక జోష్..యువతే కాదు పిల్లలు, పెద్దలు కూడా సందడి వినాయక చవితి ఉత్సవాలను చేసుకుంటారు. సెప్టెంబర్ 7న వినాయచవితికి ఇప్పటి నుంచే ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. జిల్లాలోని అనేకచోట్ల ప్లాస్టర్ ఆఫ్ పారీస్‌తో తయారుచేసిన భారీ వినాయక ప్రతిమలు అమ్మకాలకు సిద్ధమయ్యాయి. ప్లాస్టర్ ఆఫ్ పారీస్, వివిధ రకాల కెమికల్స్‌తో కూడిన రంగులు పర్యావరణానికి ముప్పు చేస్తాయని పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీ విగ్రహాలతోపాటు డీజే సౌండ్ సిస్టమ్స్‌తో ఊరేగింపులు ప్రజలో భక్తిభావం పెంపొందించడం కంటే అనేక సమస్యలు, ఇబ్బందులకు కారణమవుతున్నాయి. ఉత్సవ నిర్వాహకులు, వాస్తవ పరిస్థితులను పరిశీలించి తీరు మార్చుకుని పర్యావరణ హితంగా పూజలు చేస్తే ప్రకృతికి రక్షణ కల్పించాలని సూచిస్తున్నారు. ఈ మేరకు ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా కొన్ని స్వచ్ఛంద సంస్థలు, దాతలు మట్టి వినాయక విగ్రహాలనే ఏర్పాటు చేసుకోవాలని అవగాహన కల్పించమే గాక ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్నారు.

వాడవాడలా వినాయక మండపాలు

జిల్లాలోని పట్టణాలేగాకుండా గ్రామాల్లోను వాడవాడలా వినాయక మండపాలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసి తొమ్మిదిరోజులు పాటు ఘనంగా ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఉత్సవ మండలాల్లో దాదాపు 90 శాతం వరకు ప్లాస్టర్ ఆఫ్ పారీస్‌తోతయారుచేసి వివిధ రకాల కెమికల్స్ అద్దిన వినాయక ప్రతిమలనే ఏర్పాటు చేస్తున్నారు. తయారీదారులు కూడా ఆకర్షణీయంగా కన్పించేందుకు వివిధ రకాల ఆకృతుల్లో భారీ ప్రతిమలను తయారు చేస్తున్నారు. అలాగే ప్లాస్టర్ ఆఫ్ పారీస్‌కు త్వరగా నీటిలో కరిగే గుణం లేకపోగా ప్రతిమల్లో జిప్సం, సీసం, కాడ్మియం, గంధకం, మెగ్నీషియం, పాదరసం వంటి విష రసాయనాలు ఉంటాయని అవి నీటిలో చేరినప్పుడు అందులోని ఆక్సిజన్‌ను తగ్గించి ఆమ్లత్వాన్ని పెంచుతాయని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు.

పర్యావరణానికి ముప్పు ఇలా..

ప్లాస్టర్ ఆఫ్ పారీస్ ఏళ్లు గడిచినా భూమిలో కలవదు. ప్రతిమల తయారీకి ఉపయోగించే రంగుల్లో సిలికా, జింక్, చాక్‌పీస్ పౌడర్, గాజుపొడులు కలుపుతారు. ఇవి నీటిలో కలిస్తే ప్రమాదకరం. ఎరుపు రంగు కోసం మెర్క్యూరీ సల్ఫేట్ వాడతారు. దీని వల్ల చర్మ సంబంధ వ్యాధులు, దద్దుర్లు వస్తాయి. నలుపు రంగు కోసం రెడ్ ఆక్సైడ్, కాడ్మియం వాడతారు. వీటి వల్ల గ్రహణ శక్తి తగ్గుతుంది. మూత్ర పిండాల ఇన్‌ఫెక్షన్స్, పిల్లల శారీరక, మానసిక ప్రవర్తనల్లో మార్పులు వస్తాయి. నీలంరంగు కోసం క్రోమియం,అయోడైడ్ వాడడం వల్ల అలర్జీ, ఉబ్బసం, న్యూమోనియా లాంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. గులాబీ రంగు కోసం పొటాషియం, డైక్రోమిట్ వాడడం కారణంగా చర్మ వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. వినాయక నిమజ్జనోత్సవాలు, ఊరేగింపుల్లో రంగుల వాడకంతో కంటి చూపు కోల్పోయే ప్రమాదం ఉందని నిపుణలు చెబుతున్నారు. అయితే ప్రతి ఏడాది అధికారులు హెచ్చరికలు జారీ చేయడమే కానీ కఠినచర్యలు తీసుకోకపోవడంతో తయారీదారులతో పాటు ఉత్సవ నిర్వాహకులు పట్టించుకోవడం లేదని వివరిస్తున్నారు. పర్యావరణం పరిరక్షణ అందరూ కలిసికట్టుగా నడుం బిగించి మట్టి వినాయక ప్రతిమలనే పూజించాలని కోరుతున్నారు.

పర్యావరణ హితమే లక్ష్యం



పర్యావరణాన్ని కాపాడడానికి మట్టి వినాయక ప్రతిమలు ప్రతి ఒక్కరూ వినియోగించాలనేదే మా లక్ష్యం. దీని కోసం 2013 నుంచి పట్టణంలో మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా అందిస్తున్నాం. ముందులో వెయ్యి ప్రతిమలను పంపిణీ చేయగా ప్రస్తుతం 10 వేల ప్రతిమలు అందిస్తున్నాం. దీనిలో భాగంగానే సెప్టెంబర్ 5న భీమవరంలో 5 వేలు ప్రతిమలు, తేతలి, కాకినాడలో 5వేల ప్రతిమలు ఉచితంగా పంపిణీ చేయనున్నాం.

– నడింపల్లి వెంకటసుబ్బరాజు, జైత్ర బిజినెస్ సొల్యూషన్స్ మేనేజింగ్ పార్టనర్

కాలుష్యాన్ని తగ్గించాలి



వినాయక చవితి ఉత్సవాల్లో నీటికాలుష్యం, ధ్వని కాలుష్యం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్లాస్టర్ ఆఫ్ పారీస్ వినాయప్రతిమలు వాడకం వల్ల నీటి కాలుష్యం ఏర్పడుతుంది. అలాగే ఉత్సవాల మండపాల వద్ద, ఊరేగింపులో డీజే సౌండ్స్ పెట్టడం వల్ల శబ్ద కాలుష్యం ఏర్పడుతుంది. అందువల్ల వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోడానికి ఉత్సవ నిర్వాహకులు తగిన చర్యలు తీసుకోవాలి. మండపాలు పెట్టేముందు అనుమతులు తప్పనిసరి.

– జి.కాశీచరణ్, టుటౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్, భీమవరం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆకివీడు: స్థానిక గుమ్ములూరు రోడ్డులోని సబ్ స్టేషన్‌లో పనులు, 11 కేవీ లైన్ల వెంబడి చెట్ల కొమ్మల తొలగింపు వంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల శుక్రవారం ఆకివీడు నగర పంచాయతీ పరిధిలోనూ,ఇండస్ట్రీయల్ లైన్లలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఈఈ పీర్ అహ్మద్ ఖాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకూ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు.

భీమవరంలో..

భీమవరం అర్బన్/భీమవరం: మండలంలోని పెదగరువులోని విద్యుత్ ఉపకేంద్ర పరిధిలో శుక్రవారం 11 కేవీ బేతపూడి ఫీడర్‌పై చెట్లు, కొమ్మలు తొలగించుట, వార్షిక మరమ్మతుల నిమ్మిత్తం పలు గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్‌ఖాన్ గురువారం తెలిపారు. చినగరువు, దిరుసుమర్రు, పల్లిపాలెం, పాతూరు, తూర్పుగూడెం, శివాలయం సెంటర్ ఏరియాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు. అలాగే భీమవరం ఆఫీస్ ఏరియాలోని 33/11కె.వి ఇండోర్ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో 11 కేవీ లైన్ల పై చెట్లు కొమ్మలు తొలగించేందుకు శుక్రవారం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు సుంకర పద్దయ్య వీధి, బ్యాంక్ కాలనీ, రెడ్డి కాలనీ, చినపేట, పెద్ద ఆంజనేయ స్వామి టెంపుల్ ఏరియా, భీమేశ్వరస్వామి టెంపుల్ ఏరియా, లలిత జ్యువెలరీ ఏరియాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈ ఈ)పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. వి

ఉండిలో..

ఉండి: ఉండి,యండగండి 33,11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉందయం 8 గంటల నుండి 10 గంటల వరకు విద్యుత్ నిలుపుదల చేస్తున్నట్లు భీమవరం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఫీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. మండలంలోని ఉండి, చిలుకూరు, వెలివర్రు, మహదేవపట్నం, ఎన్నార్పీ అగ్రహారం, చెరుకువాడ, కలిసిపూడి, పెదపుల్లేరు, యండగండి, ఉణుదుర్రు గ్రామాల్లో 11 కేవీ ఫీడర్ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు

కాళ్లలో..

కాళ్ల: ఎస్సీ బోస్ కాలనీ పరిధిలోని 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రం పరిధిలోని 11 కేవీ లైన్ల చెట్ల కొమ్మలు తొలగించేందుకు శుక్రవారం ఉదయం 8 గంటలు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ ఫీర్ అహ్మద్ ఖాన్ గురువారం తెలిపారు. మండలంలోని కలవపూడి, మామిడిపూడి, మోడీ, గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు స్పష్టం చేశారు.

గౌరవ భృతి చెల్లించాలని వినతి



డీఆర్వోకి ఉదయ భాస్కర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీఎల్‌ఓలు

భీమవరం: గౌరవ భృతి చెల్లించాలని కోరుతూ పలువురు బీఎల్ఓలు డీఆర్వో ఉదయ భాస్కర్‌కు గురువారం వినతిపత్రం అందచేశారు. భీమవరం పట్టణ ఎలక్షన్ బూత్ స్థాయి అధికారులకు నాలుగేళ్లుగా అందాల్సిన గౌరవ భృతి అందడం లేదన్నారు. ఎలక్షన్ కమిషన్‌కు నివేదిక పంపించాలని కోరారు. డీఆర్వోకు వినతిపత్రం ఇచ్చిన వారిలో సాక విద్య శేఖర్ రాజు, గుమ్మళ్ల జక్కరయ్య, పాలపర్తి రమేష్, తోట కిరణ్ కుమార్, తాడి సురేంద్ర, తొత్తరమూడి నరేష్ తదితరులు ఉన్నారు.

బాల్య వివాహాల నిరోధంపై అవగాహన



ఉండిలో బాల్యవివాహాల నిరోధంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ సుజాత రాణి

ఉండి: బాల్య వివాహాల వల్ల బాలికల భవిష్యత్‌కు ఎంతో నష్టం వాటిల్లుతుందని జిల్లా న్యాయ సలహాదారు విజయలక్ష్మి అన్నారు. గురువారం ఉండి మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆకివీడు ప్రాజెక్టు ఆధ్వర్యంలో మిషన్ శక్తి స్కీమ్‌లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో విజయలక్ష్మి బాల్య వివాహాలు, అనర్థాలపై అధికారులకు వివరించారు. బాల్య వివాహాలు చేస్తే బాల్య వివాహాల నిరోధక చట్టం 2006 31,39 జీఓ ప్రకారం కఠినంగా శిక్షిస్తారని తెలిపారు.అన్ని సామాజిక వర్గాలకు చెందిన ముఖ్యమైన ప్రాంతాల్లో బాల్యవివాహాలు, మహిళలపై అఘాయిత్యాలు అనే అంశాలపై అవగాహన కల్పించాలని అన్నారు. సీడీపీఓ వి.వాణి విజయరత్నం మాట్లాడుతూ గ్రామస్థాయిలో బాల్య వివాహాలపై అందరికీ అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగార్జున, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామకృష్ణారెడ్డి, ఎంఈఓ వినాయకుడు, సూపర్‌వైజర్లు మేరీ, నాగలక్ష్మీ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

పాలకోడేరులో..

పాలకోడేరు: బాల్య వివాహాలు ప్రోత్సహించేవారిపై కఠిన చర్యలు తప్పవని మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు అధికారిణి పి.సుజాత రాణి హెచ్చరించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామస్థాయిలో బాల్య వివాహాల నిరోధక కమిటీ సభ్యులంతా కలిసి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్‌బీ విజయలక్ష్మి, మోహనరావు, సూపర్‌వైజర్లు పి.బాలాకుమారి, జి.పార్వతి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



కేవీకేలో మొక్కలు నాటుతున్న శాస్త్రవేత్తలు

ఉండి: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు మొక్కలే దిక్కుగా ఉంటాయని కేవీకే శాస్త్రవేత్తలు అన్నారు. కేంద్ర వ్యవసాయశాఖ పిలుపు మేరకు ఏక్ పేడ్ మా కే నామ్(అమ్మపేరుతో ఒక మొక్క)అనే కార్యక్రమంలో భాగంగా గురువారం ఎన్నార్పీ అగ్రహారం కృషీ విజ్ఞాన కేంద్రంలో శాస్త్రవేత్తలు మొక్కలు నాటారు. దేశ వ్యాప్తంగా సెప్టెంబర్ 2024 నాటికి 80 కోట్ల మొక్కలు,మార్చి 2025 నాటికి 140 కోట్ల మొక్కలు నాటాలనే కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ ఆశయాన్ని నెరవేరుద్దామని శాస్త్రవేత్తలు పిలుపునిచ్చారు.

నల్లి తెగులు నివారణకు చర్యలు తీసుకోవాలి



చెరుకుమిల్లిలో మాట్లాడుతున్న ఏడీఏ కేఎఎస్ఎస్ శ్రీనివాసరావు

ఆకివీడు: ఖరీఫ్‌లో అక్కడక్కడా ఆకుముడత, కాండం తొలిచే పురుగు, నల్లి తెగులు ఆశించిందని దీని నివారణకు మందులు సూచించాలని రైతులు వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. మండలంలోని చెరుకుమిల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన పొలంబడిలో ఏడీఏ కేఎఎస్ఎస్ శ్రీనివాసరావు మాట్లాడుతూ నల్లి నివారణకు క్రొఫోనోఫాస్ మందు పిచికారీ చేయవద్దని సూచించారు. వర్షాలు కురిస్తే నల్లి నశించిపోతుందని చెప్పారు. మందులు పిచికారీ చేస్తే భవిష్యత్‌లో దోమ ఉధృతి పెరగవచ్చునని హెచ్చరించారు. ఏఓ ప్రియాంక మాట్లాడుతూ మండలంలో ఈ క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తి అయిందని చెప్పారు. ఈకేవైసీ (వేలిముద్రలు) వేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో వీఏఏ రాంప్రసాద్, కేశవరాజు, వెంకట్, ఆబీకే మండల మాజీ డైరెక్టర్ ఎరిచర్ల సాంబర్లిన్, వెంకట రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

కొణితివాడలో

వీరవాసరం: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పురుగులు ప్రబలే అవకాశం ఉందని రైతులు నివారణ చర్యలు తీసుకోవాలని భీమవరం ఏడీఏ సీహెచ్ శ్రీనివాస్ సూచించారు. కొణితివాడలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఓ బిస్సీబాబు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛమైన ధాన్యాన్ని పండిద్దాం



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

ఉండి: పురుగుమందుల అవశేషాలు లేని స్వచ్ఛమైన ధాన్యాన్ని పండించి రైతులు అధిక లాభాలు ఆర్జించాలని ఏడీఏ కేఎస్ఎస్ శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండలంలోని యండగండిలో మండల వ్యవసాయాధికారి బి.సంధ్య ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ జీఏపీ (గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టిస్) సర్టిఫికేషన్ ఉపయోగాలను వివరించారు. 5 నుంచి 15 మంది ఒక గ్రూపుగా ఏర్పడి ఎఫ్‌పీఓ(ఫార్మర్ ప్రొడ్యూస్ ఆర్గనైజేషన్) రిజిస్ట్రేషన్ చేయడం ద్వారా రైతులు తమ పొల్లాల్లో జీఏపీ పొలం బడి సూచనలు అనుసరిస్తూ రసాయనిక ఎరువులు పురుగు మందులు వినియోగం తగ్గిస్తూ మేలైన యాజమాన్య పద్ధతులైన సమగ్ర సస్యరక్షణ,సమగ్ర ఎరువుల యాజమాన్యం పాటిస్తూ పురుగు మందుల అవశేషాలు లేని ఆహారోత్పత్తులను ఉత్పత్తి చేయవచ్చని అన్నారు. ఇలా ఉత్పత్తి చేసిన వాటిని సాధారణ ధరల కంటే అధికంగా మార్కెట్‌లో అమ్మి లాభాలు ఆర్జించే అవకాశం ఉందన్నారు. కాబట్టి రైతులు సాంప్రదాయ వ్యవసాయ పద్ధతులు విడిచిపెట్టి అధికారులు తెలిపే సూచనలు సలహాలు పాటించి నూతన వ్యవసాయ పద్ధతుల ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని ఆయన సూచించారు.

ఆక్రమణల తొలగింపుపై అనవసర రాద్ధాంతం



విలేకరులతో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా నాయకుడు జేఎన్వీ గోపాలన్

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీ పరిధిలోని అయిభీమవరం రోడ్డులో తొలగించిన ఆక్రమణలకు గడువు అడిగామని, దీనిని కావాలనే రాద్ధాంతం చేస్తున్నారని సీపీఎం జిల్లా నాయకులు జేఎన్వీ గోపాలన్ అన్నారు. స్థానికంగా గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందికరమైన పనులను తమ పార్టీ చేయదన్నారు. ఆక్రమణ బాధితులకు సమయం ఇవ్వాలని మాత్రమే సూచించామన్నారు. బలవంతంగా ఆక్రమణలు తొలగించడం నేరమన్నారు. బాధితులకు ఆశ్రయం కల్పించిన తరువాతే తొలగించాలని కోర్టులు కూడా చెబుతున్నాయన్నారు. వెంకయ్య వయ్యేరు పంట కాలువ వల్ల ఆకివీడు, కాళ్ల మండలాల్లోని ప్రజలు అనారగ్యోంతో బాధపడుతున్నారన్నారు. దుంపగడప గ్రామానికి వెళ్లే పంట కాల్వ కలుషితమైతే తామూ వ్యతిరేకమేనన్నారు. పంట కాలువలను ప్రక్షాళన చేయాలని గతం నుంచి తమ పార్టీ పోరాడుతుందని గోపాలన్ చెప్పారు. సమావేశంలో సీపీఎం నాయకులు సందక సూరిబాబు, డోకల రవి తేజ పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రీడా ర్యాలీని ప్రారంభిస్తున్న టూటౌన్ సీఐ కాళీ చరణ్

భీమవరం: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని, యువత విద్యతోపాటు క్రీడల పట్ల ఆసక్తి కనబర్చాలని టూటౌన్ సీఐ కాశీ చరణ్ అన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక క్రీడా విద్యార్థుల ఆధ్వర్యంలో క్రీడా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడా ర్యాలీనీ సీఐ కాశీ చరణ్ ప్రారభించి మాట్లాడారు. ప్రతి విద్యార్థీ క్రీడలు వ్యాయామం యోగా తప్పక చేయాలని, వీటి ద్వారా మానసిక శాంతి లభిస్తుందని, తద్వారా విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తారని అన్నారు. అనంతరం ర్యాలీ అభిరుచి రోడ్డు మీదుగా సరోవర్ రోడ్డు శ్రీరాంపురం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనురాధ, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, కళాశాల ఏఓ బోణం సురేష్ పాల్గొన్నారు.

డీఎన్నార్ కళాశాలలో

డీఎన్నార్ కళాశాలలో ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ జి.మోజెస్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గాదిరాజు సత్యనారాయణ రాజు మాట్లాడుతూ భారత దేశం గర్వించదగ్గ క్రీడా కారుడు ధ్యాన్ చంద్ గౌరవార్థం జాతీయ క్రీడా దినోత్సవాలు నిర్వస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ కెప్టెన్ ఎ.వీరయ్య, సీనియర్ క్యాడెట్లు బి.లీలా శంకర్, ఎల్.కుశేంద్ర కుమార్ పాల్గొన్నారు.

ఎస్ఆర్‌కేఆర్‌లో

జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్యాన్ చంద్ చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు, ఉపాధ్యక్షుడు ఎస్వీ రంగరాజు, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి.సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాక్ బృందం పర్యటన



కార్యక్రమంలో మాట్లాడుతున్న నాక్ బృంద సభ్యులు

ఆకివీడు: మండలంలోని దుంపగడప వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నాక్ బృందం పర్యటించింది. కళాశాలలోని అన్ని డిపార్టుమెంట్‌లను, ల్యాబ్‌లు, లైబ్రరీలను పరిశీలించిన బృంద సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కళాశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్ని తిలకించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కె.సుజాత విలేకరులతో మాట్లాడుతూ నాక్ పీర్ బృందం ఛైర్మన్ సర్థార్ పటేల్ విశ్వ విద్యాలయం వైస్‌ఛాన్సలర్ షిరీష్ కుల్‌కర్ని, మెంబర్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎస్ఎంకే. ఖాదరీ పాల్గొన్నట్లు చెప్పారు. శుక్రవారం ఈ–ఎసెస్‌మెంట్ జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల అభివృద్ధి కమిటీ కార్యదర్శి ఎన్వీ రామరాజు(తాడినాడ బాబు), సీపీడీసీ కమిటీ కార్యదర్శి డాక్టర్ పీబీ ప్రతాప్ కుమార్, పూర్వ విద్యార్థి సంఘ అధ్యక్షుడు గొంట్లా కృష్ణమూర్తి, నేరెళ్ల రామ చెంచయ్య, దాసరి వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన తెలుగు భాషా వారోత్సవాలు



భీమవరం: విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న దృశ్యం

భీమవరం: శ్రీ విజ్ఞానవేదిక, తెలుగు భాషాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో గత నాలుగురోజులుగా నిర్వహిస్తున్న తెలుగు భాషా వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని భీమవరం జేఎల్‌బీ గరల్స్ మున్సిపల్ హైస్కూల్లో నిర్వహించారు. 56 మంది తెలుగు సంస్కృతి సంప్రదాయాలపై చేసిన ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. 6,7 తరగతి విద్యార్థులు ప్రదర్శించిన బుర్రకథ అందరినీ ఆలోచింపజేసింది. వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాద్ రాజు, హెచ్ఎం పీబీ శ్రీనివాస్ మాట్లాడుతూ దశాబ్ద కాలంగా తెలుగు భాషా దినోత్సవాన్ని వారోత్సవాలుగా నిర్వహించడం అభినందనీయమన్నారు. తెలుగు పండితులు రచయిత కలిగోట్ల గోపాలశర్మ, నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి, కె.వాసు, కె.గోపాలరాజు, ఎం.రోహిణి పాల్గొన్నారు.

వీరవాసరంలో..



వీరవాసరం: పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

వీరవాసరం: గిడుగు రామ్మూర్తి పంతులు 160వ జయంతిని పురస్కరించుకుని స్థానిక ఎంఆర్‌కే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వీరవాసరంలో తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తత్వం, చిత్రలేఖన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పంపన సాయిబాబు కానుకొలను శ్రీనివాస్, జుత్తిగ శ్రీనివాస్, మన్నె వెంకటేశ్వరరావు, బి.విజయలక్ష్మి, శనివారపు ప్రసాద్, భానుకుమారి, సత్య శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.